గణితం అనగానే కొంతమంది గడ గడ వణికిపోతే... ఇంకొందరు టక టకా స్టెప్పులేసుకుంటూ వెళ్లిపోతారు. ఇది ఒక సబ్జెక్టు మాత్రమే కాదు. విస్తృత ఉద్యోగావకాశాలు కల్పించే వేదిక కూడా. ఇంజినీరింగ్, అకౌంటింగ్ మొదలు అంతరిక్షం వరకు గణితం అన్ని రంగాల్లో ఉందంటే అతిశయోక్తి కాదు. బోధన, పరిశోధనలతోపాటు ఎన్నో రకాల ఉద్యోగాలకు ఈ నిపుణుల అవసరం ఉంది. అందుకే గణితానికి సంబంధించి కొన్ని సంస్థలు అందిస్తున్న ప్రత్యేక కోర్సులతోపాటు ఉన్నతమైన ఉద్యోగాల గురించి తెలుసుకుందాం.



లెక్కలంటే.. మక్కువుంటే!

గణితం అంటే కొంచెం భయంగా.. చాలా గౌరవంగా అనిపిస్తుంది. నూటికి నూరు మార్కులు తెచ్చుకోడానికి వీలున్న విభాగాల్లో ఎందరికో ఇష్టమైన సబ్జెక్టు ఇది. లెక్కలపై మక్కువ ఎక్కువగా ఉంటే, వాటినే జీవితంగా గడపడానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయి. ఉన్నత విద్యపరంగా చూస్తే ఎన్నో ప్రఖ్యాత సంస్థలు రకరకాల కోర్సులను అందిస్తున్నాయి. ఉపాధిని పరిశీలిస్తే బోధన, పరిశోధన రంగాల్లో పలు కొలువులు ఆహ్వానం పలుకుతున్నాయి. మ్యాథ్స్‌పై శ్రద్ధ, ఆసక్తి ఉంటే మొదటగా గుర్తుకొచ్చేది ఇంజినీరింగ్. అది వాస్తవమే. గణితంపై పట్టు వల్ల కచ్చితంగా ఇంజినీరింగ్‌లో ఉన్నత స్థానాన్ని చేరుకోవచ్చు. అప్లైడ్ మ్యాథమేటిక్స్ వంటి స్పెషలైజేషన్లతో ఉన్నత విద్యను, ఉపాధి మార్గాన్ని ఎంచుకుంటే లెక్కలే సర్వస్వంగా జీవనాన్ని సాగించవచ్చు.

ప్రత్యేక సంస్థలు

ఆర్యభట్ట నుంచి రామానుజన్ వరకు ఎందరో మహానుభావులు భారతదేశ గణిత చరిత్రకి పునాదులు వేశారు. ఆధునిక కాలంలోనూ కేవలం గణితం కోసం ప్రత్యేకమైన సంస్థలు ఏర్పాటయ్యాయి. మ్యాథమేటిక్స్‌లో ఈ కింది సంస్థలు ప్రత్యేక గుర్తింపుతో ప్రపంచ పటంలో తమకంటూ స్థానాన్ని దక్కించుకున్నాయి. ఆయా సంస్థల్లోకి ప్రవేశాల వివరాలను సంబంధిత వెబ్ సైట్‌ల్లో చూడవచ్చు.

- చెన్నై మ్యాథమేటికల్ ఇన్‌స్టిట్యూట్, చెన్నై www. cmi.ac.in
- ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మ్యాథమేటికల్ సైన్సెస్, చెన్నై www.imsc.res.in
- టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రిసెర్చ్, www.tifr.res.in
- హరీశ్ చంద్ర రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, www.hri.res.in
- సీఆర్ రావు అడ్వాన్స్‌డ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మ్యాథమేటిక్స్, స్టాటిస్టిక్స్ అండ్ కంప్యూటర్ సైన్స్ www.crraoaimscs.org

ప్రఖ్యాత గణిత శాస్త్రవేత్త సీఆర్ రావు పేరుతో ప్రారంభమైన ఈ సంస్థ ప్రపంచ ప్రఖ్యాతి చెందింది. ఈ సంస్థలోని కింది విభాగాలు ఉత్తమమైన పరిశోధనా విద్యకి, మేధోపరమైన ఉపాధికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎన్నో మార్గాలు చూపిస్తున్నాయి.

- సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మ్యాథమేటికల్ సైన్సెస్
- సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ స్టాటిస్టిక్స్
- సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ క్రిప్టోగ్రఫీ
- సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ కంప్యూటేషనల్ జెనోమిక్స్

మ్యాథమేటిక్స్ రంగంలో రిసెర్చ్ సైంటిస్ట్, రిసెర్చ్ అసోసియేట్స్, సీనియర్ రిసెర్చ్ ఫెలోషిప్, ప్రాజెక్ట్ అసిస్టెంట్ వంటి పేర్లతో కెరియర్ ప్రారంభానికి కావాల్సిన ప్రోత్సాహాన్ని సీఆర్ రావు ఇన్‌స్టిట్యూట్ అందిస్తోంది. దీంతోపాటు ఏటా స్టాటిస్టిక్స్ ఒలింపియాడ్‌లను నిర్వహించి హైస్కూల్ స్థాయిలో విద్యార్థుల ప్రతిభాపాటవాలను వెలుగులోకి తీసుకొస్తోంది.

వివిధ సంస్థల్లో విభిన్న కోర్సులు

సాధారణంగా మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్స్, అప్లైడ్ మ్యాథ్స్ తదితరాల్లో బీఎస్సీ కోర్సులను; మాస్టర్స్ స్థాయిలో రకరకాల స్పెషలైజేషన్లతో ఎమ్మెస్సీని మన దేశంలోని దాదాపు అన్ని యూనివర్సిటీలు, వాటి అనుబంధ కళాశాలలు అందిస్తున్నాయి. వీటితోపాటు దేశంలో ప్రముఖ విద్యాసంస్థలైన ఐఐటీలు, ఐఐఎస్సీల్లోని మ్యాథమేటిక్స్ డిపార్ట్‌మెంట్‌ల్లో ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ, ఎమ్మెస్సీ-పీహెచ్‌డీ డ్యూయల్ డిగ్రీ కోర్సుల్లోకి జామ్ (జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ ఎమ్మెస్సీ) ర్యాంకుతో ప్రవేశాలు కల్పిస్తున్నాయి. బ్యాచిలర్ డిగ్రీలో మ్యాథమేటిక్స్ చదివితే జామ్ రాయడానికి అర్హత లభిస్తుంది. మ్యాథమేటిక్స్, స్టాటిస్టిక్స్ పేపర్లతో ఎమ్మెస్సీ పూర్తి చేస్తే మినూత్న రంగాలకు సంబంధించిన ఉన్నత విద్యను అభ్యసించవచ్చు. ఆపరేషన్స్ రిసెర్చ్, ఎన్వి రాన్‌మెంటల్ సైన్స్, ఓషన్ అండ్ అట్మాస్ఫిరిక్ సైన్స్, అప్లైడ్ స్టాటిస్టిక్స్ విభాగాల్లో ఎమ్మెస్సీ-పీహెచ్‌డీ చేయవచ్చు. జామ్ ద్వారా భువనేశ్వర్, బాంబే, దిల్లీ, ధన్‌బాద్, గాంధీనగర్, గువాహటి, హైదరాబాద్, ఇండోర్, జోద్‌పూర్, కాన్పూర్, రోపర్, పట్నా, రూర్కీల్లోని ఐఐటీల్లోకి ఎమ్మెస్సీ-పీహెచ్‌డీ అడ్మిషన్లు లభిస్తున్నాయి. ఈ కోర్సులు పరిశోధన రంగంలో మంచి ఉద్యోగాలకు మార్గం చూపిస్తాయి.

రవి కటుకం
ఇన్నోవేషన్ ఇవాంజెలిస్ట్

భారత ప్రభుత్వం ఉన్నతశ్రేణి సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ కోసం ఐఐఎస్ఈఆర్‌లను బరంపురం, భోపాల్, కోల్‌కతా, మొహాలీ, పుణె, తిరువనంతపురం, తిరుపతిల్లో ఏర్పాటు చేసింది. వీటి ద్వారా అయిదు సంవత్సరాల బీఎస్-ఎంఎస్ ప్రోగ్రామ్‌ని అందిస్తోంది. ప్రస్తుతం ఐఐఎస్ఈఆర్-2018 నోటిఫికేషన్ విడుదలైంది.

పరిశోధనలో!

మ్యాథమేటిక్స్‌లో పీహెచ్‌డీ చేసిన వారికి ప్రభుత్వ రంగ పరిశోధన సంస్థలైన ఇండియన్ స్పేస్ రిసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో), డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో), సొసైటీ ఫర్ ఎలక్ట్రానిక్ ట్రాన్సాక్షన్స్ అండ్ సెక్యూరిటీ (ఎస్ఈటీఎస్) ఉన్నత ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాయి.

ఐబీఎం, మైక్రోసాఫ్ట్ లాంటి సంస్థలు మ్యాథమేటిక్స్‌లో ప్రావీణ్యం సాధించినవారికి థియరిటికల్ కంప్యూటేషన్ పేరుతో పరిశోధనా విభాగంలో ఎక్కువ వేతనంతో కూడిన ఆకర్షణీయ ఉద్యోగాలను ఇస్తున్నాయి.

కేంద్ర ప్రభుత్వ పరిధిలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీకి చెందిన సైన్స్ అండ్ ఇంజినీరింగ్ రిసెర్చ్ బోర్డ్ ఆయా రంగాల్లో పరిశోధనకు కావాల్సిన ఆర్థిక సాయాన్ని రామానుజన్ ఫెలోషిప్‌ల పేరుతో అందిస్తోంది.

ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో

ఉపాధికి సంబంధించి పరిశీలిస్తే ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో విస్తృతంగా అవకాశాలు ఉన్నాయి.

ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ మొదలు యూనివర్సిటీ ప్రొఫెసర్ల వరకు ఉన్నాయి.

మ్యాథమేటిక్స్‌కి సంబంధించి ముఖ్యంగా స్టాటిస్టిక్స్‌లో దేశవ్యాప్తంగా ప్రాముఖికమైన ఉద్యోగం జూనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్ (జేఎస్ఓ). ఇది స్టాటిస్టిక్స్ రంగంలోకి ప్రవేశ ద్వారం లాంటిది. స్టాఫ్ సెలక్షన్ కమిషన్ కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ పరీక్ష ద్వారా మూడంచెల విధానంలో ఈ పోస్టులను భర్తీ చేస్తోంది. సాధారణంగా ఏప్రిల్‌లో ఈ పరీక్ష నోటిఫికేషన్ విడుదలవుతుంది. పూర్తి వివరాలకు www.ssc.nic.in చూడవచ్చు.

జేఎస్ఓగా ఎంపికైన అభ్యర్థులు సబార్డినేట్ స్టాటిస్టికల్ సర్వీస్ (ఎస్ఎస్ఎస్) కేడర్‌లో మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్ అండ్ ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్‌లో భాగంగా పని చేస్తారు. వీరు డేటా కలెక్షన్, డేటా ప్రాసెసింగ్ లాంటి కార్యక్రమాల్లో అంకగణిత పరంగా ప్రభుత్వ ప్రణాళికలకు సాయపడతారు.

జేఎస్ఓల పదోన్నతి ఈ కింది విధంగా ఉంటుంది.

జూనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్ ➔ సీనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్ ➔ అసిస్టెంట్ డైరెక్టర్ ➔ డిప్యూటీ డైరెక్టర్ ➔ జాయింట్ డైరెక్టర్ ➔ డైరెక్టర్ ➔ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ➔ అడిషనల్ డైరెక్టర్ జనరల్ ➔ డైరెక్టర్ జనరల్

స్టాటిస్టిక్స్ రంగంలో ఉద్యోగాలు అందజేసే మరో ముఖ్య సంస్థ ఇండియన్ అగ్రికల్చరల్ స్టాటిస్టిక్స్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (www.iasri.res.in). ఇది ఎలాంటి ఉద్యోగాలకు నోటిఫికేషన్‌లు ఇస్తుందో తెలుసుకోడానికి వెబ్‌సైట్‌ను చూడవచ్చు.

రాష్ట్రస్థాయిలో కూడా అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు వస్తాయి. ఆయా రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్లు భర్తీని నిర్వహిస్తాయి.

స్టాటిస్టిక్స్‌లో బీఎస్సీ లేదా ఎమ్మెస్సీ లేదా పీహెచ్‌డీ చేసినవారు ప్రైవేటు రంగంలో ఈ కింది టూల్స్/టెక్నాల జీలు నేర్చుకోవడం ద్వారా కార్పొరేట్ రంగంలో అధిక వేతనాలు పొందవచ్చు.

◗ ఆర్ ప్రోగ్రామింగ్ టూల్ ◗ ఎస్ఏఎస్ ◗ ఎస్పీఎస్ఎస్
◗ మినిట్యాబ్ ◗ ఎక్సెల్ అనలిటిక్స్ ◗ మ్యాట్‌లాబ్
◗ స్టాటా

స్టాటిస్టిక్స్‌లో పట్టుతో పాటు కొన్ని ప్రోగ్రామింగ్ లాంగ్వేజెస్‌లో నైపుణ్యాన్ని సంపాదిస్తే దాదాపు అన్ని ఫైనాన్స్, ఇన్సూరెన్స్, బ్యాంకింగ్ కంపెనీల్లో ఉద్యోగాలు పొందవచ్చు.

మ్యాథ్స్‌లో పీజీ ఉంటే ఐఐటీ, ఎంసెట్, క్యాట్, శాట్, జీమ్యాట్ తదితర ఎన్నో రకాల పరీక్షార్థులకు గణితం బోధించవచ్చు. పీహెచ్‌డీ చేసిన వారు ఇంజినీరింగ్ కాలేజీల్లో ప్రొఫెసర్ ఉద్యోగాల్లో చేరవచ్చు. యూపీఎస్సీ, ఎస్ఎస్సీ, బ్యాంక్‌లు మొదలైన పోటీ పరీక్షల్లోనూ గణితం కీలకమైన విభాగం. ఆ అభ్యర్థులకూ శిక్షణ ఇవ్వవచ్చు.

టెక్నాలజీ అభివృద్ధిలో ప్రధాన పాత్ర గణిత నిపుణులదే అని చెప్పవచ్చు. రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తదితర రంగాల్లో మ్యాథ్స్, స్టాటిస్టిక్స్ చదివిన వారికి డిమాండ్ ఉంది. ఆపరేషన్స్ రిసెర్చ్ అనలిస్ట్, సిస్టమ్ అనలిస్ట్ తదితర సాఫ్ట్‌వేర్ కొలువులు, డేటా సైంటిస్టులు వంటి ఉన్నతమైన ఉద్యోగాలూ మ్యాథ్స్ మేధావులకు స్వాగతం పలుకుతున్నాయి.

■ ఎన్నో ఉద్యోగాలు.. మరెన్నో కోర్సులు

పునశ్చరణే విజయ సూత్రం

సీఎంఏ టాప్ ర్యాంకర్ పూజిత

'పాసైతే చాలు' అనుకుందా విద్యార్థిని. కానీ క్రమపద్ధతిలో పట్టుదలగా కృషి చేసింది. ఫలితంగా టాప్ ర్యాంకును కైవసం చేసుకుంది. సాధారణ మధ్యతరగతి కుటుంబానికి చెందిన పూజిత ఇటీవల విడుదలైన సీఎంఏ (ఐసీడబ్ల్యూఏ) ఫైనల్ పరీక్ష ఫలితాల్లో జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. భీమవరం ప్రాంతానికి చెందిన ఈమె సీఏ, సీఎంఏ.. ఈ రెండు కోర్సులనూ ఏకకాలంలో అభ్యసించటం విశేషం. తన విజయ రహస్యాలను ఆమె ఇలా పంచుకున్నారు.

పేరు: గణపతినీడి పూజిత
ఊరు: రాయకుదురు (భీమవరం)
పదో తరగతి: 568 మార్కులు ఇంటర్: 981 మార్కులు
సీఏ సీపీటీ: 180 మార్కులతో అఖిల భారత స్థాయిలో పదో ర్యాంకు
సీఎంఏ ఫైనల్: ఆల్‌ఇండియా ఒకటో ర్యాంకు

మాది భీమవరానికి సమీపంలోని రాయకుదురు గ్రామం. నాన్న మురళీధర్ సాధారణ రైతు. మా ఊరిలోనే వ్యవసాయం చేస్తుంటారు. పదోతరగతి చదువుతున్నప్పుడే సీఏ/ సీఎంఏ కోర్సులపై ఆసక్తి ఏర్పడింది. భీమవరంలోని విశ్వకవి పాఠశాలలో చదివాను. పదోతరగతిలో 568 మార్కులు సాధించాను. అందరూ నన్ను ఇంజినీరింగ్/ ఐఐటీ లేదా మెడిసిన్ చదవమని సలహాలు ఇచ్చారు. కానీ నాకు కామర్స్ కోర్సులైన సీఏ/ సీఎంఏలే చదవాలని ఉండేది. సీఏ చదవాలంటే ఇంటర్‌లో ఎంఈసీనే మేలని అప్పుడు నాకు తెలియదు. అందుకే ఎంపీసీ తీసుకుని చదివాను. ఇంటర్‌లో 981 మార్కులు సాధించాను. అప్పటికే సీఏ చదవాలనే పట్టుదలతో ఉన్నాను.

సీపీటీలో పదో ర్యాంకు

అందరూ తీసుకునే రొటీన్ కోర్సులను చదవకూడదనే సీఏ కోర్సును ఎంచుకొని 'మాస్టర్ మైండ్స్' సంస్థలో చేరాను. సీఏ-సీపీటీ కష్టంగా ఉంటుందేమోనని మొదట్లో కొంచెం భయపడ్డాను. కానీ నాకు కోర్సు ఏ రోజూ కష్టం అనిపించలేదు. సీపీటీలో మొదటి ప్రయత్నంలోనే 200 మార్కులకు 180 తెచ్చుకోవడమే కాకుండా ఆల్ ఇండియా పదో ర్యాంకును సాధించాను.

సీపీటీతోపాటు సీఎంఏ ఫౌండేషన్ కూడా చేశాను. ఆ తరువాత ఐపీసీసీ, సీఎంఏ ఇంటర్ రెండు కోర్సులూ మొదటి ప్రయత్నంలోనే కంప్లీట్ అయ్యాయి. ఇప్పుడు సీఎంఏ ఫైనల్ కూడా మొదటి ప్రయత్నంలోనే పూర్తి చేయడంతోపాటు అఖిల భారత స్థాయిలో మొదటి ర్యాంకు కూడా పొందాను.

ఈ విజయం మా అమ్మానాన్నల కష్టానికి ప్రతిఫలం అనిపించింది. ఎందుకంటే అమ్మానాన్నలు నేనూ, చెల్లి ఎక్కడ చదువుతుంటే అదే ఊరికి వచ్చి మాతోపాటు ఉండి మమ్మల్ని ప్రోత్సహించేవారు. ఇప్పుడు బంధువులు, తెలిసినవాళ్లు అభినందిస్తుంటే అమ్మానాన్నల ఆనందానికి అవధుల్లేవు.

సీఏలో అడ్వాంటేజ్

బీటెక్‌లో అయితే కుదరదు గానీ.. సీఏతో పాటు మరో కోర్సు కూడా చదువుకోవచ్చు. అందుకనే నేను సీఎంఏ కోర్సును ఎంచుకున్నాను. కొంతమంది విద్యార్థులైతే సీఏతోపాటు బీకాం కూడా చదువుతుంటారు. ఇది కూడా మంచి ఆప్షనే! ఒకవేళ ఏ కారణం చేతనైనా సీఏ కోర్సులో అనుకున్నంత ప్రతిభ చూపలేక పాస్ అవ్వకపోతే బీకాం పూర్తి చేసుకోవచ్చు. మంచి బిజినెస్ స్కూల్‌లో ఎంబీఏ పూర్తి చేసుకుని జీవితంలో స్థిరపడవచ్చు. ప్రస్తుతం నేను సీఏ ఫైనల్‌కు సిద్ధమవుతున్నా.

అడ్డంకులకు బెదరకూడదు

ఏదైనా సాధించాలని లక్ష్యం పెట్టుకున్నపుడు ఏవైనా అవరోధాలు ఎదురైతే నిరాశా నిస్పృహలకు గురికాకూడదు. లక్ష్య సాధనకు కావాల్సినంత కష్టపడుతూనే ఉండాలి. సీఏ/ సీఎంఏ లక్ష్యంగా పెట్టుకున్న తరువాత మధ్యలో నాకూ చాలా అవాంతరాలు వచ్చాయి. కానీ పట్టుదలతో లక్ష్యం దిశగానే ముందుకు సాగాను. .

సీఎంఏ చదవాలనుకునేవారు ముందుగా సీఏ కోర్సుకి కోచింగ్ తీసుకుని ఉంటే సీఎంఏ చాలా సులభంగా పూర్తిచేయవచ్చనేది నా అభిప్రాయం.

పూర్వ ప్రశ్నల విశ్లేషణ

స్కానర్ (ఇంతకుముందు పరీక్ష పత్రాలు)ను విశ్లేషించుకోవడానికి తగిన సమయాన్ని కేటాయించాలి. ఆర్‌టీపీ (రివిజన్ టెస్ట్ పేపర్)-2 అటెంప్ట్స్, ఎంటీపీఎస్ (మోడల్ టెస్ట్ పేపర్స్), పీటీపీఎస్ (ప్రాక్టీస్ టెస్ట్ పేపర్స్)ను తప్పకుండా సాధన చేసుకోవాలి. కచ్చితంగా ఇలా చేస్తే కనీసం 60% మార్కులు పొందవచ్చు. వీటిని ఇన్‌స్టిట్యూట్ వెబ్‌సైట్ www.icmai.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

సీఏ, సీఎంఏ కోర్సులు చదివే ప్రతి విద్యార్థి తప్పకుండా రివిజన్ పరీక్షలకు హాజరు కావాలి. సీఏ విద్యాసంస్థలు ఇప్పుడు ప్రత్యేకమైన రివిజన్ బ్యాచ్‌లను నిర్వహిస్తున్నాయి. పునశ్చరణ లేకుండా ఇలాంటి కోర్సుల్లో విజయం సాధించడం దాదాపుగా అసంభవమే. నా విజయానికి కారణం ఉత్తమ శిక్షణతోపాటు రివిజన్ పరీక్షలకు హాజరుకావడమే. తరగతిలో వినడం ఎంత ముఖ్యమో పద్ధతి ప్రకారం పునశ్చరణ చేసుకోవడమూ అంతకన్నా ముఖ్యం. సన్నద్ధత సమయంలో తప్పకుండా ప్రతి అంశానికీ ప్రాముఖ్యమివ్వాలి. అన్ని అంశాల పునశ్చరణా సరిగా చేయగలిగారో లేదో చూసుకోవాలి.

సీఎంఏ ఫైనల్ కేవలం పాస్ అవుతానని కున్న నేను క్రమపద్ధతిలో సాగించిన పునశ్చరణ వల్లే ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంకర్‌గా మారాను. వీలైనంత త్వరగా సీఏ ఫైనల్ కూడా పూర్తిచేసి మంచి కార్పొరేట్ ఉద్యోగంతో స్థిరపడాలనేది నా లక్ష్యం.

వెయిటేజి గమనించి ప్రణాళిక

సీఎంఏ పరీక్షలకు సన్నద్ధమయ్యేటపుడు ఎలాంటి ప్రశ్నలు అడుగుతున్నారు, ఏయే అంశాలను ఎక్కువగా కవర్ చేస్తున్నారనే అంశాలపై ప్రత్యేకంగా దృష్టిసారించాలి.

వెయిటేజీని గమనించి సన్నద్ధమవ్వాలి. సిలబస్‌లోని అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలి. ప్రతి చాప్టర్ మొదటి పేజీల్లో ఈ వెయిటేజీ తాలూకు వివరాలున్నాయి. సీఎంఏ ఇన్‌స్టిట్యూట్ వారు ప్రశ్నపత్రాన్ని రూపొందించేటప్పుడు కచ్చితంగా ఈ వెయిటేజీని అనుసరిస్తారు. ప్రతి విద్యార్థీ ఒక ప్రణాళిక తయారు చేసుకోవాలి. ఈ సందర్భంగా వెయిటేజీని పరిగణనలోకి తీసుకోవాలి.

ఇంతకు పూర్వంలా ప్రతి పేపర్‌లోనూ అంశాలవారీగా కాకుండా సెక్షన్లవారీగా వెయిటేజీ ఇచ్చారు. విద్యార్థి ఎట్టి పరిస్థితుల్లోనూ సెలక్టివ్‌గా అధ్యయనం చేయకూడదు. అన్ని అంశాలపై అవగాహన అవసరం.

గత రెండు పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలను కూలంకషంగా విశ్లేషించుకోవాలి. పరీక్షలో ఏవిధమైన ప్రశ్నలు అడుగుతున్నదీ (అబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్, ప్రాక్టికల్, థియరీ, కేసులాస్) విశ్లేషించుకుని ఆ విధంగా సన్నద్ధమవ్వాలి.

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

ఎన్‌టీపీసీలో ఎగ్జిక్యూటివ్ ట్రైనీలు

పోస్టు: ఎగ్జిక్యూటివ్ ట్రైనీ-హెచ్ఆర్
ఖాళీలు: సంస్థ నిబంధనల ప్రకారం
అర్హత: యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ 2018 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు.
ఎంపిక: సివిల్స్ ఇంటర్వ్యూకు హాజరై సర్వీసులకు ఎంపిక కాని అభ్యర్థుల జాబితా ఆధారంగా.
దరఖాస్తు: ఎన్‌టీపీసీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం: 2019 మార్చి సివిల్ సర్వీసెస్ దరఖాస్తుకు
చివరితేదీ: 06.03.2018
వెబ్‌సైట్: www.ntpccareers.net/

ఎయిర్‌లైన్ అలైడ్ సర్వీసెస్ లిమిటెడ్

పోస్టులు: స్టేషన్ మేనేజర్, కేబిన్ క్రూ తదితరాలు.
ఖాళీలు: 35 **అర్హత:** డిగ్రీ, బీఈ/ బీటెక్, ఎంసీఏ, సీఏ, ఇతర అర్హతలు.
ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా
దరఖాస్తు: ఆఫ్‌లైన్ **దరఖాస్తు ఫీజు:** రూ.1500 **చివరితేదీ:** 23.03.2018
వెబ్‌సైట్: http://www.airindia.in/

వాక్ ఇన్ ఇంటర్వ్యూ

మనూ, హైదరాబాద్
పోస్టులు: ఫిమేల్ మెడికల్ ఆఫీసర్-01, మేల్ జిమ్ ట్రైనర్-01
అర్హత: ఎంబీబీఎస్, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత, అనుభవం.
ఇంటర్వ్యూ తేదీ: 05.03.2018
వేదిక: మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ (మనూ) గెస్ట్ హౌస్, గచ్చిబౌలి క్యాంపస్, హైదరాబాద్.
వెబ్‌సైట్: www.manuu.ac.in/

ప్రవేశాలు

తెలంగాణ ఎంసెట్-2018

తెలంగాణలోని 2018-19 విద్యా సంవత్సరానికి గాను వివిధ వృత్తి విద్యా కళాశాలల్లో ప్రవేశాలు
కోర్సులు: బీఈ/ బీటెక్, బీఎస్సీ, బీవీఎస్సీ అండ్ ఏహెచ్, బీఎఫ్ఎస్సీ, బీఫార్మసీ, ఫార్మాడీ.
అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత.
ఎంపిక: ప్రవేశపరీక్ష ద్వారా.
ఎంసెట్ తేదీలు: 2018 మే 2, 3, 4, 5, 7
దరఖాస్తు: ఆన్‌లైన్ **దరఖాస్తు ఫీజు:** రూ.800 **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ:** 04.03.2018 నుంచి 04.04.2018 వరకు
వెబ్‌సైట్: http://eamcet.tsche.ac.in/

ఐఐఎస్ఈఆర్‌లలో డ్యూయల్ డిగ్రీ

దేశవ్యాప్తంగా ఉన్న ఏడు ఐఐఎస్ఈఆర్ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్)లలో ఉమ్మడి ప్రవేశాలు
కోర్సు: బీఎస్-ఎంఎస్ డ్యూయల్ డిగ్రీ
కాల వ్యవధి: 5 సంవత్సరాలు
ప్రవేశాలు కల్పించనున్న ఐఐఎస్ఈఆర్‌లు: బరంపూర్, భోపాల్, కోల్‌కతా, మొహాలీ, పుణె, తిరువనంతపురం, తిరుపతి.
అర్హత: సైన్సు సబ్జెక్టులతో 2017, 2018 సంవత్సరాల్లో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత.
ఎంపిక: కిశోర్ వైజ్ఞానిక ప్రోత్సాహన్ యోజన (కేవీపీవై) ఫెలోషిప్/ జేఈఈ అడ్వాన్స్‌డ్ 2018 ర్యాంకు/ ఐఐఎస్ఈఆర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ద్వారా.
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ: 2018 మే లో ప్రారంభం. **దరఖాస్తు ఫీజు:** రూ.2000
వెబ్‌సైట్: www.iiseradmission.in/

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.